క్లుప్తంగా

మ్యాజిక్ పోటీల్లో బాషాకు ద్వితీయ స్థానం



ట్రోఫీ, నగదు అందుకుంటున్న బాషా

దాబాగార్డెన్స్: పల్నాడు జిల్లా నర్సారావుపేటలో నిర్వహించిన పల్నాడు మ్యాజిక్ ఫెస్ట్–2025లో నగరానికి చెందిన షేక్ అన్వర్ బాషా ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీల్లో విశాఖ, హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగుళూరు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి సుమారు 300 మంది మెజీషియన్స్ పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో షేక్ అన్వర్ బాషా ప్రదర్శన ఇచ్చి, ద్వితీయ స్థానం సొంతం చేసుకున్నారు. సంస్థ అధ్యక్షుడు బి.నాయుడు, పలువురు ప్రముఖులు బాషాకు ట్రోఫీ, నగదు ప్రోత్సాహకం అందజేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

గీతా భవన్‌లో 2 నుంచి వేసవి శిక్షణ శిబిరం

దాబాగార్డెన్స్: పాతనగరం రాజప్పనాయుడు వీధిలోని గీతా భవనంలో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో మే 2 నుంచి 11వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, 8 నుంచి 16 ఏళ్లలోపు బాల బాలికలు, విద్యార్థులకు కుల మతాలకతీతంగా ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణలో యోగ విద్య, ధ్యానం, గీతా పారాయణం, శ్రీవిష్ణు సహస్రనామం, సంస్కృత భాషా పరిచయం, దేశభక్తి, ఆధ్యాత్మికం, ఆదర్శవంతుల జీవిత కథలు, భక్తి గీతాలు, సుభాషితాలు, చిత్రలేఖనం, నైతిక విలువలు, వేద గణితంపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు గీతా ప్రచార సమితి ప్రధాన కార్యదర్శి ఎం.వనజాదేవిని 70326 62344 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గురుకుల ఉపాధ్యాయులకు శిక్షణ



కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్న గురుకులాల గణిత ఉపాధ్యాయులు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం గురుకులంలో సోమవారం గురుకులాల గణిత ఉపాధ్యాయులకు మొదటి విడత కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ప్రారంభమైంది. ఈ నెల 30 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని గురుకులాల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బెంగుళూరు అజీమ్ ప్రేమ్‌జీ వర్సిటీ నుంచి అనుపమ, రత్న కృష్ణ హాజరై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. గణిత బోధనలో మెలకువలు, విద్యార్థులు గణితంలో ఎక్కువ మార్కులు సాధించడానికి చేయాల్సిన కృషి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక నైపుణ్యంతో గుర్తింపు

మురళీనగర్: విద్యార్థులు తమకంటూ ప్రత్యేక నైపుణ్యం సాధించడం ద్వారా గుర్తింపు పొందవచ్చని వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో విద్యార్థులకు పెయింటింగ్‌పై ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించి, మాట్లాడారు. చిత్రలేఖనం, సంగీతం, నాట్యం తదితర కళల్లో రాణించాలంటే ప్రత్యేక తర్ఫీదు పొందాలన్నారు. ఈ సందర్భంగా ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై డి.భవాని విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ పెయింగ్‌పై ఉచిత శిక్షణ తరగతులు మే 6 వరకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల పిల్లలు నేరుగా సాయంత్రం 4.30 నుంచి 6 వరకు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, సహాయ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాలిపోయి.. విరిగిపోయి..

పాడైన డంపర్‌బిన్లు

చక్రాల్లేక ఇబ్బందులు



33వ వార్డు కుమ్మరవీధిలో వివేకానంద జంక్షన్‌కు వెళ్లే దారిలో..



34వ వార్డు వాడబలిజ సేవా సంఘం వద్ద ..



33వ వార్డు అల్లిపురం మెయిన్‌రోడ్డు కోదండ రామాలయం వద్ద..



33వ వార్డు నీలమ్మవేపచెట్టు దేవస్థానం వద్ద ..



34వ వార్డు కొబ్బరితోట వద్ద..

అల్లిపురం: డంపర్‌బిన్లు పాడవడంతో ప్రజలు, పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ జోన్–4 పరిధి, 32, 33, 34 వార్డులలో పలుచోట్ల డంపర్‌బిన్ల చక్రాలు పాడయ్యాయి. దీంతో ఒకపక్కగా వాలిపోయి, విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. వాటిలో చెత్త వేసినా కిందనే పడిపోతుందని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. పాడైన డంపర్‌బిన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా, కొత్తవి ఏర్పాటు చేయడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రక్‌కు లింక్ చేయలేక..

డంపర్‌బిన్‌లో చెత్త తీసుకువెళ్లే ట్రక్ సిబ్బంది డంపర్‌బిన్లు లింక్ చేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. పాడైన డస్ట్‌బిన్లకు రిపేర్లు చేయించాలని, లేదా కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చాలా చోట్ల పాడయ్యాయి

నియోజకవర్గంలో చాలాచోట్ల డంపర్‌బిన్లు పాడయ్యాయి. చాలాకాలంగా వాటిని తొలగించలేదు. కొన్నిచోట్ల పాడైన డంపర్‌బిన్‌లు తొలగించినా, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు. చెత్త కింద వేయడంతో గాలికి ఎగిరిపోతోంది. దీంతో రోడ్డంతా అస్తవ్యస్తంగా మారుతోంది. – పి.రమణారెడ్డి, 33వ వార్డు

కిందపడిన చెత్త మళ్లీ ఇళ్లలోకి..

డంపర్‌బిన్లు పాడవటంతో చెత్త అంతా కిందే పడుతుంది. ఆ చెత్త గాలికి ఎగిరి ఇళ్లలోకి వస్తోంది. పాడైనవి తొలగించినా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. అధికారులు స్పందించి డంపర్‌బిన్లు కొత్తవి ఏర్పాటు చేయాలి.
–ఎల్.శ్రీనివాస్, జెండాచెట్టు వీధి

పేద విద్యార్థికి వాసుపల్లి ఆర్థిక సాయం



రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: విద్య గొప్ప దానమని.. ప్రజాసేవకుడిగా పేద విద్యార్థులకు అండగా నిలవడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 27వ వార్డు నాయకుడు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పందిరి ఆశీష్ అనే విద్యార్థి తన తల్లితో కలిసి ఆశీల్‌మెట్ట సమీపంలోని కార్యాలయంలో వాసుపల్లిని కలిశారు. కళాశాల ఫీజు విషయమై తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. వెంటనే స్పందించిన వాసుపల్లి తన సొంత నిధుల నుంచి ఆశీష్‌కు రూ.10 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉన్నత స్థాయికి ఎదిగి పది మందికి సహాయం అందించాలని ఆశీష్‌కు సూచించారు. ఆరోగ్య ప్రదాత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని పేదలకు అందిస్తే.. ఆయన వారసుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చారని గుర్తు చేశారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, వైద్య కళాశాలల నిర్మాణం, లక్షలాది మంది తల్లులకు అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందని వాసుపల్లి ఆరోపించారు. అడ్డదారుల్లో నగర మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుని.. విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. మాజీ కార్పొరేటర్ పద్మనాభం అమ్మాజీ, దశమంతుల చిన్ని, ఆకుల శ్యామ్, నారాయణమూర్తి, చింతకాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఈవో సురేష్‌బాబా

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో కొలువైన ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర ఉత్సవాల పోస్టర్, కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వీటిని ఆవిష్కరించారు. మే 17న తొలేళ్ల ఉత్సవం, 18న ప్రధాన జాతర మహోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. అమ్మవారి ప్రతిమలు కావలసిన భక్తులు దేవస్థానం కౌంటర్ వద్ద సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ లండా రమణ, ఆలయ అర్చకులు పులఖండ శ్రీకాంత్ శర్మ ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

లౌకిక తత్వానికి హాని కలిగిస్తే సహించం



మాట్లాడుతున్న సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

సీతంపేట: భారత లౌకిక తత్వానికి హాని కలిగిస్తే సహించమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ హెచ్చరించారు. కులవివక్ష పోరాట సమితి, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'మత స్వేచ్ఛ–భారత రాజ్యాంగం' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో హిందూవాదాన్ని లౌకిక రాజ్యాంగంలో బలవంతంగా రుద్దాలనే ప్రయత్నాన్ని అడ్డుకోవాలన్నారు. ఎంతో చరిత్ర ఉన్న భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి మను సంస్కృతిని ప్రవేశ పెట్టాలనే ప్రయత్నాలు మొదలుపెట్టారని విమర్శించారు. ఇప్పటికే ఆర్ఎస్ఎస్ ఒకే దేశం.. ఒకే ఎన్నికలు, ఒకే పౌరస్మృతి వంటి వాదనలు తెస్తున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను ముందుకు తీసుకురావడం వల్ల దేశ లౌకిక వాదానికి, ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ ప్రజలకు తీరని నష్టం కలిగిస్తుందని, దీనిని ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ దేశంలోని అన్ని రాజ్యాంగ, మౌలిక వ్యవస్థలపైనా దాడి జరుపుతూనే ఉందన్నారు. దేశంలో సామాజిక న్యాయం అమలు చేయడం ఇష్టం లేని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బన్న, రాష్ట్ర నాయకులు భాగ్యలక్ష్మి, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకంగా బంగారు పతకాలు

- విరాళాలు అందించిన ఏయూ ఆచార్యులు



ఏయూ వీసీ రాజశేఖర్‌కు చెక్కు అందజేస్తున్న ఆచార్యులు శశికళ, వై.ఆర్.రెడ్డి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగంలో ఎం.ఎల్.ఐ.సి.కోర్సులో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందజేయాలని కోరుతూ విభాగ విశ్రాంత ఆచార్యులు సి.శశికళ రూ.1.50 లక్షల చెక్కును ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్‌కు సోమవారం అందజేశారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా సేవలందిస్తున్న డాక్టర్ వై.ఆర్.రెడ్డి హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి బంగారు పతకాన్ని అందించాలని కోరుతూ రూ.1.50 లక్షల చెక్కును అందజేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ బంగారు పతకాలు అందించడానికి అవసరమైన నిధులను విశ్వవిద్యాలయానికి అందజేసిన ఆచార్య శశికళ, డాక్టర్ వై.ఆర్.రెడ్డిలను వీసీ రాజశేఖర్ అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు.

మత పెద్దల కృషితో బాల్య వివాహాల నియంత్రణ

ఆరిలోవ: బాల్య వివాహాల నియంత్రణ కోసం వివిధ మత పెద్దలు కృషి చేయాలని అప్‌హోల్డ్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు జి.డేవిడ్ రాజు కోరారు. ఆర్గనైజేషన్ సభ్యులతో కలసి ఆయన సోమవారం పెదగదిలిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో బాలల హక్కుల సంరక్షణ, బాల్య వివాహాలు నివారించడానికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో అందులో భాగంగా కొన్ని చోట్ల బాల్య వివాహాలు జరిగే అవకాశముందన్నారు. అలాంటి వివాహాలు జరగకుండా అన్ని మతాల పెద్దలు అడ్డుకోవాలని కోరారు. తమ సంస్థ బాలల అక్రమ రవాణాను అడ్డుకుంటోందని తెలిపారు. ఇటీవల వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 100 మంది పిల్లలను ఆంధ్రప్రదేశ్ రైల్వే స్టేషన్లలో రైల్వే పోలీసుల సహకారంతో పట్టుకుని తిరిగి వారికి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. బాల్య వివాహాలు చేయడం, బాలలను అక్రమంగా తరలించడం తదితర కార్యకలాపాలు చట్టరీత్యా నేరమన్నారు. సమావేశంలో సభ్యులు చక్రవర్తి, ఏసురత్నం పాల్గొన్నారు.

జోన్–5కు రెండే అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జోన్–5 కమిషనర్ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులే అందాయి. జోనల్ కమిషనర్ బి.రాము అర్జీలను స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను తక్షణ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, దిలీప్‌కుమార్, డీఈ భరణి, ఏఈ రత్నాకర్ ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్, సర్వేయర్ లీలా పాల్గొన్నారు.

సీతంపేటలో చోరీ

సీతమ్మధార: ఇంట్లో బీరువా తాళాలు తీసి దొంగతనానికి పాల్పడిన ఘటన ఆదివారం సీతంపేటలో జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం .. ముత్యాల లక్ష్మి అనే ఓ మహిళా భర్త, కుమారులతో కలిసి సీతంపేట గణేష్‌నగర్‌లోని రాధాకృష్ణ టెంపుల్ ఎదురుగా ఉన్న ఇంట్లో నివసిస్తోంది. ఆదివారం ఎప్పటిలాగే ఆమె ఉద్యోగానికి వెళ్లే ముందు ఇంటి తలుపులు వేసి తాళాలు కిటికీ పక్కన పెట్టింది. రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా.. తలుపుల తాళాలు తీసి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువా తాళాలు దానికి వదిలి ఉండటాన్ని గమనించారు. కంగారుగా బీరువా తెరచి చూడగా.. అందులో ఉన్న 1.5 తులాల బంగారం, 7.5 తులాల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు పోయినట్టు గుర్తించారు. సోమవారం ఉదయం బాధితురాలు ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ప్రతినిధులు

సీతమ్మధార: నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్ఎం)లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల(సీహెచ్‌వో) సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా మహిళా కార్యదర్శి పి.మణి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సీహెచ్‌వోలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈపీఎఫ్‌ను పునరుద్ధరించి, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌వోలను మినహాయించాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, బదిలీలు, అదనపు గ్రాట్యుటీ, పితృత్వ సెలవులు అమలు చేయాలని కోరారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు గంట సుధ, కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌ను సందర్శించిన మిజోరాం విద్యార్థులు



మిజోరాం విద్యార్థులతో కళాశాల సిస్టర్లు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలను మిజోరాం విశ్వవిద్యాలయం విద్యార్థుల బృందం సోమవారం సందర్శించింది. ప్రొఫెసర్ రాజశేఖర్ నేతృత్వంలో 27 మంది విద్యార్థుల ప్రతినిధులు విశాఖలోని పలు విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల సందర్శనార్థం వచ్చారు. అందులో భాగంగా సెయింట్ జోసెఫ్ కళాశాలలో విద్యుచ్ఛక్తి, మౌలిక సదుపాయాలను అధ్యయనం చేయడానికి వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. 130 ఏళ్ల చరిత్ర కలిగిన కళాశాల భవనాలను విద్యార్థులు పరిశీలించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ మాణిక్యకుమారి, సిస్టర్ మేరీ, సిస్టర్ డైసీ, సిస్టర్ నాన్సీ, డాక్టర్ అరుణాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆక్యుప్రెజర్‌పై అవగాహన



ఆక్యుప్రెజర్‌పై అవగాహన కల్పిస్తున్న నిపుణురాలు

మురళీనగర్: స్థానిక వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో ఆక్యుప్రెజర్ వైద్యంపై సోమవారం అవగాహన కల్పించారు. డాక్టర్ షామారాణి పాల్గొని ఆక్యుప్రెజర్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆక్యుప్రెజర్ ద్వారా రక్తప్రసరణ అన్ని అవయవాలకు సక్రమంగా చేరి, అనేక శారీరక సమస్యలు తగ్గుతాయన్నారు. మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారాన్ని పొందారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, వాకర్స్ ఇంటర్నేషనల్ ఆర్‌సీ–5 యు.శుభ, క్లబ్ కార్యదర్శి జయ, సంయుక్త కార్యదర్శి శిరీష లత, కోశాధికారి భానుమతి, సంయుక్త కోశాధికారి ప్రమీలరావు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించే శిబిరంలో కథలు, కథనాలు, పుస్తక పఠనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. జూన్ 6వ తేదీ వరకు శిబిరం ఉంటుందన్నారు. ఎంఈవో పుష్యరాగం మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో కథల పుస్తకాలు, గ్రంథాలు, జీకే పుస్తకాలు, పిల్లల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, పిల్లలు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలు బోధించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎల్ రాజేంద్రవర్మ, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

36వ వార్డు రంగిరీజువీధిలోని బాలల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఏవీఎన్ కళాశాల లైబ్రేరియన్ ఎం.స్వరాజ్యలక్ష్మి, లైబ్రేరియన్లు ప్రియాంక, కె అనితకుమారి పాల్గొని సరస్వతీదేవికి పూజలు చేసి, శిబిరం ప్రారంభించారు. స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ 40 రోజుల పాటు నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లలకు నీతి కథలు వివరించారు. కార్యక్రమంలో 30 మంది పిల్లలు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి తెలిపారు.



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న ఎంఈవో పుష్యరాగం

అల్లిపురం శాఖా గ్రంథాలయంలో..

అల్లిపురం: గ్రంథాలయంలో జరిగే వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయుడు డి.సత్యనారాయణ కోరారు. అల్లిపురం శాఖా గ్రంథాలయంలో రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కథలు, కథనాలు, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పెయింటింగ్, డాన్స్, క్విజ్, జీకే, యోగా, క్రాఫ్ట్ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొనాలని గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు కోరారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్ చొరవతో బాలిక సంరక్షణ



పాపా హోంలో వర్షిణిని చేర్పిస్తున్న మహిళా పోలీస్

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చొరవతో వర్షిణి అనే 9 ఏళ్ల బాలికకు సంరక్షణ లభించింది. ఆదివారం సాయంత్రం డైమండ్ పార్క్ సమీపంలో వర్షిణి ఒంటరిగా ఉందన్న సమాచారంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బాలికల పాపా హోంలో ఫోర్త్ టౌన్ మహిళా పోలీస్ సిబ్బంది చేర్పించారు. వర్షిణి తల్లి దురదృష్టవశాత్తూ మరణించడం, తండ్రి మద్యానికి బానిసై.. కూతురి యోగక్షేమాలను పట్టించుకోకపోవడంతో ఇంటి నుంచి వచ్చేసింది. వర్షిణి తన ఇంటి చిరునామా చెప్పలేక పోవడం వల్ల బాలిక భద్రత, తక్షణ అవసరాలను పరిగణనలోకి తీసుకుని పాపా హోంలో ఆశ్రయం కల్పించారు. వర్షిణి తన విద్యను కొనసాగించేలా సహాయ పడటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు.